క్లుప్తంగా

వర్షంతో ఉపశమనం



శంకరమఠం రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

తాటిచెట్లపాలెం: మండే ఎండలతో అల్లాడుతున్ననగరవాసులకు ఆదివారం కురిసిన భారీ వర్షం కొంత ఉపశమనమిచ్చింది. మధ్యాహ్నం ఆకస్మాత్తుగా జోరు వాన కురవడంతో వాతావరణం చల్లబడింది. తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, శంకరమఠం, సీతమ్మధార తదితర ప్రాంతాల్లోని రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. రాకపోకల సమయంలో వాహన చోదకులకు కొంత ఇబ్బంది ఎదురైంది.

సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్ టౌన్ సీఐ సత్యనారాయణ

తాటిచెట్లపాలెం: రౌడీషీటర్లు తమ ప్రవర్తను మార్చుకుని మంచిగా మెలగాలని ఫోర్త్ టౌన్ సీఐ సత్యనారాయణ సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీ షీటర్లపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఎటువంటి గొడవలు, తగదాల్లో తలదూర్చకుండా సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. హద్దులు మీరితే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.

పైడిమాంబ ఆలయంలో భారీ అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న కమిటీ సభ్యులు

కంచరపాలెం: స్థానిక ఐటీఐ జంక్షన్‌లోని సుంకురపేట ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబ అమ్మవారి వేడుకల్లో భాగంగా ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పులఖండం శ్రీనివాసశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు పిల్లి చంద్రశేఖర్, పిల్లి నాగమణి, సీతారామ్, శోభారాణి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో నిర్వహించిన భారీ అన్న సమారాధనను స్థానిక నాయకులు, ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ప్రారంభించారు. సుమారు 5 వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్స్ నూతన కార్యవర్గం




నూతన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రోటరీ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి

దాబాగార్డెన్స్: ప్రతి ఒక్కరూ సేవే లక్ష్యంగా పని చేయాలని రోటరీ గవర్నర్ కల్యాణ్ చక్రవర్తి పిలుపునిచ్చారు. రోటరీక్లబ్ వైజాగ్ డైమండ్స్ 2025–26 ఏడాదికి నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎస్.కామేశ్వర రావు, కార్యదర్శిగా కె.మారుతి, కోశాధికారిగా ఏఎన్ గోపాల్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి వీరిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన కార్యవర్గ సభ్యులు చక్కటి సేవా కార్యక్రమాలు నిర్వహించి సేవే లక్ష్యంగా సంస్థ ఉన్నతికి కృషి చేయాలన్నారు. పి.శోభన్‌ప్రకాష్, అసిస్టెంట్ గవర్నర్ ఎన్.గాయత్రి నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఎన్నికైన కామేశ్వరరావు బృందం ముందుగా తమ ఆమోదాన్ని తెలిపి, రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్స్ ద్వారా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పచ్చదనాల పరిమళం

- సందర్శకులను పరవశింపజేస్తున్న మురళీనగర్ పార్కులు
- మొక్కల పెంపకం, గ్రీనరీ పరిరక్షణకు నిర్వాహకుల ప్రత్యేక చర్యలు
- ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొత్త చిగుళ్లు
- కనువిందు చేస్తున్న సుందర ఉద్యానవనాలు



వాకర్స్ పార్కులో అరుదైన బోధి వృక్షం కింద ధ్యాన ముద్రలో బుద్ధుడు



మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో పచ్చదనం



హరిత పార్కులో కొత్త చిగురుతో మెరిసిపోతున్న మొక్కలు



ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో పచ్చదనం



సుదర్శన్ పార్కులో పచ్చని చెట్లు



వాకర్స్ పార్కులో అరుదైన వృక్షాలు

మురళీనగర్: మురళీనగర్ పరిసరాల్లోని పార్కులు సందర్శకులను పచ్చదనంతో పరవశింపజేస్తున్నాయి. పార్కుల్లో మొక్కల పెంపకం, పచ్చదనం పరిరక్షణకు నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకోవడం, ఇటీవల కాలంలో వరుసగా వారం రోజుల పాటు వర్షాలు కురవడం వల్ల చెట్లు కొత్త చిగుళ్లు తొడుగుకున్నాయి. దీంతో పార్కులన్నీ సుందరంగా కనిపిస్తూ కనువిందు చేస్తున్నాయి.

ఒకటిని మించి మరొకటి

జీవీఎంసీ 49, 50 వార్డుల పరిధి మురళీనగర్‌లో 8 పార్కులు ఉండగా.. ఒక దానిని మించి మరొక పార్కును అభివృద్ధి చేశారు. వాకర్స్ పార్కులో అభివృద్ధికి మొదటి బీజాలు పడగా.. ఇతర పార్కులు దీన్ని అనుసరించాయి. ప్రతి పార్కులోనూ పచ్చదనం పరిరక్షణను ఒక ప్రత్యేక ఉద్యమంగా చేపట్టారు. దీంతో పార్కులకు వెళ్లగానే పచ్చదనం పలకరిస్తుంది. స్వచ్ఛమైన గాలిని ప్రసాదిస్తుంది. వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వాకింగ్ ట్రాక్ చుట్టూ కడియం నుంచి తెచ్చిన మొక్కలు నాటడంతో పచ్చదనం మధ్య వాకర్స్ ఆనందంగా నడక సాగిస్తున్నారు. ల్యాండ్ స్కేపింగ్‌తోపాటు ఇతర బ్యూటిఫికేషన్ మొక్కలు, పూల చెట్లు కొత్త అందాలను ఇస్తున్నాయి.

అరుదైన వృక్షాలకు నిలయం

వాకర్స్ పార్కు అరుదైన వృక్షాలకు నిలయంగా చెప్పవచ్చు. పార్కులోకి ప్రవేశించగానే అనేక ఫల వృక్షాలతోపాటు ఆయుర్వేద వైద్యానికి పనికి వచ్చే వృక్షాలు ఇక్కడ ఉన్నాయి. పురాణ కాలం నాటి చెట్లు ఇక్కడ దర్శనమిస్తాయి. దీనికి తోడు ప్రాంగణం మొత్తాన్ని పచ్చదనంతో నింపేశారు. ఇక్కడ పచ్చదనం పరిరక్షణకు వాకర్స్ క్లబ్ సభ్యులు తరచుగా శ్రమదానం నిర్వహిస్తారు. అందరూ ఉత్సాహంగా చెట్ల ప్రూనింగ్‌లో పాల్గొంటారు. భారీ వృక్షాలను దశాబ్దాలుగా పరిరక్షిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

సందర్శకులతో కళకళ

బృందావన్ పార్కు, హరిత పార్కు, సుదర్శన్ పార్కు, ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కుల్లో ఇటీవల కురిసిన వర్షాలకు మొక్కలు కొత్త చిగుళ్లతో అందంగా మెరిసిపోతున్నాయి. దీంతో సందర్శకులు పెరిగారు. మురళీనగర్ వాకర్స్ పార్కు, వైశాఖి స్పోర్ట్స్ పార్కులు ఉదయం, సాయంత్రం వేళల్లో సందర్శకులతో కిక్కిరిసిపోయి.. కళకళలాడుతున్నాయి.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారికి ఆదివారం ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తులకు సేవలందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఎంవీపీకాలనీ: వెంకోజీపాలెం కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పెదగదిలికి చెందిన కంచు మల్లేశ్వరి(56) మృతి చెందారు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివి. మల్లేశ్వరి భర్త మరణించడంతో ఆమె అల్లుడు కంచుమూర్తి మధుబాబు, కూతురుతో కలిసి పెదగదిలిలో నివాసం ఉంటోంది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటల సమయంలో ఆమెకు అనారోగ్యంగా ఉండటంతో అల్లుడు ద్వారకానగర్‌లోని వైద్యుడి వద్దకు తీసుకెళ్లాడు. వైద్య పరీక్షల అనంతరం తిరిగి ఇంటికి వెళ్తుండగా.. వెంకోజీపాలెం కూడలి వద్ద సీఎంఆర్ ఫంక్షన్ హాల్ ఎదురుగా జాతీయ రహదారిపై ప్రమాదానికి గురయ్యారు. హైవేపై వేగంగా దూసుకొచ్చిన వ్యాన్ వారి బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోగా.. వ్యాన్ మల్లేశ్వరిపై నుంచి దూసుకెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం జరిగిన వెంటనే వ్యాన్‌ను అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. ఈ ఘటనపై ఆమె అల్లుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాజ్యాధికారంతోనే దళితులకు విముక్తి



సదస్సులో ప్రమాణం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

తాటిచెట్లపాలెం: నిరంతరం అణచివేత, దాడులకు గురవుతున్న దళితులకు రాజ్యాధికారంతోనే విముక్తి సాధ్యమని కారంచేడు ఉద్యమ నేత సిర్రా నేతాజీ భగత్‌సింగ్ అన్నారు. భీమ్‌సేన వార్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ‘కారంచేడు నరమేధానికి 40 ఏళ్లు’ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులపై హంతక దాడులు కారంచేడుతో ఆగలేదని, ఆ పరంపర నేటికీ కొనసాగుతూనే ఉందన్నారు. భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, దానిని రక్షించుకోవడానికి బహుజనులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. దళిత మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకతోటి బాబూరావు మాట్లాడుతూ కారంచేడు దురాగతానికి వ్యతిరేకంగా దేశవ్యాప్త పోరాటాన్ని నిర్మించిన నేపథ్యంలోనే దళిత మహాసభ ఏర్పడిందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కూడా ఈ ఉద్యమం సాధించిన విజయమన్నారు. సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి మాట్లాడుతూ దళితులు ఆత్మగౌరవంతో బతుకుతుంటే ఆధిపత్య కులాలు హంతక దాడులు చేస్తున్నాయని దుయ్యబట్టారు. కార్యక్రమ అధ్యక్షుడు భీమ్‌సేన వార్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కారంచేడు, చుండూరు, లక్ష్మీపేట వరకు అనేక హంతక దాడులు దళితులపై సాగాయని, సత్వర న్యాయం మాత్రం జరగడం లేదన్నారు. విరసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణ్ రావు, ప్రొఫెసర్ కోటి జాన్, పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు టి.శ్రీరామ్మూర్తి, డిఐటియు నాయకుడు చింతా చిట్టిరాజు, భారత్ డెవలప్‌మెంట్ పార్టీ వ్యవస్థాపకుడు చింతాడ సూర్యం తదితరులు ప్రసంగించారు. భీమ్‌సేన వార్ అధ్యక్షుడు కె.చిన్నారావు, ప్రతినిధులు నామాల రేణుకుమార్, కుంచె మధు, వి.వి.దుర్గారావు, బల్లంకి కనకరాజు, మర్రా చంద్రశేఖర్, యెద్దు బాలకృష్ణ, గుడివాడ అప్పారావు, రవికుమార్, కృష్ణకుమారి, శంకర్, వెంకట్ నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

పోయిన బ్యాగ్ దొరికింది



పోగొట్టుకున్న బ్యాగ్‌ను ప్రయాణికుడికి అందజేస్తున్న మేనేజర్లు జీవీ రమేష్, ఎంవీ రావు

దాబాగార్డెన్స్: విజయనగరం జిల్లాకు చెందిన ఎస్‌కే స్వామినాయుడు ఆదివారం మధురవాడ వచ్చేందుకు విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఏపీఎస్‌ఆర్‌టీసీ బస్సు ఎక్కాడు. మధురవాడ పాయింట్‌కు వచ్చే సరికి బస్సులో బ్యాగ్ మరిచిపోయి దిగిపోయాడు. తర్వాత చూసుకుని కండక్టర్‌ను ఆశ్రయించాడు. మీ బ్యాగ్ ద్వారకాబస్ స్టేషన్ మేనేజర్‌కు అప్పజెప్పాను. పూర్తి వివరాలతో మీరు స్టేషన్ మేనేజర్‌ను కలవమని కండక్టర్ చెప్పాడు. స్వామినాయుడు ద్వారకాబస్ స్టేషన్‌కు వచ్చి స్టేషన్ మేనేజర్ జీవీ రమేష్‌ను కలిసి బస్సులో బ్యాగ్ మరిచిపోయిన వివరాలు తెలపడంతో స్టేషన్ మేనేజర్ ప్రయాణికుడికి బ్యాగ్ అప్పగించారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ ఎంవీ రావు, సెక్యూరిటీ ఆర్‌జీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాటాదారులకు 14 శాతం డివిడెండ్

- ప్రకటించిన మహారాజా బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణంరాజు



మహాసభలో మాట్లాడుతున్న రామకృష్ణంరాజు

తాటిచెట్లపాలెం: తన వాటాదారులకు 14 శాతం డివిడెండ్‌ను ప్రకటిస్తున్నట్లు మహారాజా బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు తెలిపారు. సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం ది మహారాజా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్ 25వ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 మార్చి 31 నాటికి ముగిసే ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు రూ.290.39 కోట్ల డిపాజిట్లు, రూ.202.16 కోట్ల రుణాలు కలిపి మొత్తం రూ.492.55 కోట్ల వ్యాపారం కలిగి ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఆర్థిక ఏడాదిలో రూ.4.36 కోట్ల స్థూల ఆదాయం ఆర్జించగా.. రూ.1.13 కోట్లు ఆదాయపు పన్ను చెల్లించి.. రూ.3.23 కోట్ల నికర ఆదాయం ఆర్జించినట్లు చెప్పారు. బ్యాంక్ మూలధనం రూ.15.88 కోట్లు, రిజర్వ్, ప్రొవిజన్‌లు కలిపి రూ.17.29 కోట్లతో, నికర విలువ రూ.30.79 కోట్లు కలిగి ఉన్నట్లు తెలిపారు. 2024–25కి గాను వాటాదారులకు 14 శాతం డివిడెండ్‌ను ప్రకటించారు. వచ్చే మార్చి 31 నాటికి రూ.550 కోట్ల వ్యాపారమే లక్ష్యంగా నిర్ణయించామన్నారు. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుగా మార్పు చెందాల్సిన ఆవశ్యకతపై చర్చించారు. సామాజిక, సిబ్బంది పిల్లలకు దాదాపు రూ.8 లక్షల స్కాలర్‌షిప్‌లు, 2 లాప్‌టాప్‌లు అందజేశారు. త్వరలో విజయవాడ, రాజమహేంద్రవరం, రామచంద్రపురాల్లో నూతన బ్రాంచ్‌లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మహాసభకు పైడా ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ పైడా కృష్ణప్రసాద్, ది గాయత్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వనమాల శ్రీనివాస్(తెలంగాణ రాష్ట్రం జగిత్యాల) ఆత్మీయ అతిథులుగా హాజరయ్యారు. కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంక్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శ్యామ్‌కిషోర్, బ్యాంకు డైరెక్టర్లు, ఖాతాదారులు, వాటాదారులు పాల్గొన్నట్లు జనరల్ మేనేజర్ ఎన్.ఎన్.సత్యనారాయణ తెలిపారు.

ఆకట్టుకున్న పురాతన కెమెరాల ప్రదర్శన



కెమెరాల ప్రదర్శనను తిలకిస్తున్న నగర వాసులు

ఏయూక్యాంపస్: జాతీయ కెమెరా దినోత్సవం సందర్భంగా ఆదివారం వీఎంఆర్డీఏ పార్క్ ఆవరణలో ప్రదర్శించిన పురాతన కెమెరాలు ఆకట్టుకున్నాయి. వాల్తేరు ఫొటోగ్రఫీ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందకు పైగా విభిన్న రకాల కెమెరాలను ప్రదర్శించారు. 1940 నుంచి నేటి వరకు ఉపయోగించిన కెమెరాలను ప్రదర్శనలో ఉంచి, వాటి ప్రత్యేకతలను సందర్శకులకు సొసైటీ ప్రతినిధులు వివరించారు. కెమెరాలను పరిశీలించిన పలువురు సందర్శకులు, వాకర్స్ వాటితో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పి.ఎన్.సేతు, కార్యదర్శి ఎం.వి. శ్రీనివాస రెడ్డి, క్లబ్ సభ్యులు వేణుగోపాలరావు, సన్నీ, ఎస్.శ్రీనివాస రావు, రాము, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యాటకులను గౌరవించాలి



స్పీడ్ బోట్ డ్రైవర్లు, లైఫ్‌గార్డ్‌లకు సూచనలిస్తున్న మెరైన్ సీఐ శ్రీనివాసరావు

కొమ్మాది: పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌కు వచ్చే పర్యాటకులను గౌరవంగా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని రుషికొండ మెరైన్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. ఈ బీచ్‌లో విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్‌లు, స్పీడ్ బోట్ డ్రైవర్లు, ఇతర సిబ్బందితో ఆదివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రుషికొండ బీచ్‌కు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి ఎంతోమంది పర్యాటకులు వస్తుంటారని, వారితో గౌరవంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో మెరైన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు



గుట్కా, పాన్‌పరాగ్ వంటి మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకుంటున్న వన్‌టౌన్ పోలీసులు

దాబాగార్డెన్స్: వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఆదివారం సేఫ్ క్యాంపస్ జోన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. విద్యా సంస్థల పరిసర ప్రాంతాల్లో పాన్‌షాపులు, ఇతర దుకాణాల్లో నిషేధిత మత్తు పదార్థాలు, సిగరెట్లు, గంజాయి, మద్యం, పాన్ పరాగ్, గుట్కా తదితరాలు విక్రయించకూడదని వన్‌టౌన్ సీఐ జీడీ బాబు హెచ్చరించారు. కళాశాలలు, పాఠశాలల పరిసర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే కాక నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ డ్రైవ్ ఈగల్ విభాగం సమన్వయంతో నగర పరిధిలో విస్తృతంగా కొనసాగిస్తామన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

చిన్నపాటి వర్షానికే.. ముంపునకు గురైన జ్ఞానాపురం

- పలు వీధుల్లో మురుగు వరద
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం



మురుగు నీటితో నిండిపోయిన సెబాస్టియన్ కాలనీలోని వీధులు



రాసవీధిలో కూడలిలో చేరిన మురుగునీరు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం ఎర్రిగెడ్డ సమీపంలో పలు కాలనీలు ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి మురుగు నీటితో జలమయమయ్యాయి. ఎర్రిగెడ్డలో పూడికలు తీయకపోవడంతో చిన్నపాటి వర్షానికే కాలనీలు నీట మునిగాయి. జ్ఞానాపురంలో గెడ్డ వీధి, రాసవీధి, స్లీవ్‌గుర్తు వీధి, సెబాస్టియన్ కాలనీ, బాబూ కాలనీ తదితర కాలనీల వీధులు రెండు అడుగుల లోతు మురుగు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సెలవు దినం కావడంతో పారిశుధ్య సిబ్బంది జాడ కనిపించలేదు. వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కావడంతో పూడికల తొలగింపు, తదితర పనులకు నిధులు మంజూరులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిల్‌లో కార్పొరేటర్ ఎర్రిగెడ్డ పూడికలు తీసే టెండర్ పిలవాలని జీవీఎంసీ మేయర్‌ను కోరారు. వర్షా కాలం కావడంతో తక్షణమే పూడికలు తీయించాలని కోరినా.. పట్టించుకోకపోవడంతో నేడు జ్ఞానాపురానికి ముంపు వాటిల్లినట్లు పలువురు స్థానికులు వాపోయారు. ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలని కోరుతున్నారు.

కూటమి నాయకుల నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి



జూన్‌లో జరిగిన జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో ఎర్రిగెడ్డ పూడికలు తీసే టెండర్ ఆమోదించి పనులు చేపడతామని మేయర్ పీలా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సర్వసభ్య సమావేశం జరిగి నెలరోజులు గడిచినా పూడికలు చేపట్టకపోవడంతో నేడు జ్ఞానాపురంలో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. దీనిపై కౌన్సిల్ సమావేశంలో నిరసన చేపట్టి వార్డు ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తాను.

– కోడిగుడ్ల పూర్ణిమ, కార్పొరేటర్, 41వ వార్డు

శిల్పారామంలో ఆకట్టుకున్న కోలాటం



కోలాటం ప్రదర్శిస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం(జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కోలాట నృత్యం ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. అన్నమయ్య కీర్తనలు, వివిధ కూచిపూడి నృత్యాంశాలకు కోలాటం ప్రధానంగా నర్తించి కళాకారులు ఆకట్టుకున్నారు. బుజ్జి బుజ్జి గణపయ్య గీతానికి ప్రదర్శించిన నృత్యంతో కార్యక్రమం ప్రారంభం కాగా.. భావములోనా.. జతిస్వరం.., ముకుందా ముకుందా.. తదితర గీతాలతోపాటు కోలాటం బ్యాక్‌గ్రౌండ్‌గా అరకు థింసాను అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆకాంక్ష, మౌనిక, ప్రజ్ఞ, చిన్నారి, రాజీ, సంజన, మన్విత, నవ్య తదితర కళాకారులు పాల్గొనగా.. మోహనలక్ష్మి నృత్య దర్శకత్వం వహించారు. కార్యక్రమాన్ని స్థానిక ఏవో రమేష్ రెడ్డి పర్యవేక్షించారు.